# 'ప్రకృతి ముందు మనిషి'

'పిల్లంగ్రోవియ చెల్వ కృష్ణన ఎల్లినోడిదిరీ'

మోహనలో సమ్మోహకరంగా పురంధర దాసు కీర్తన...

మహాద్భుతమైన కంఠం... సహకారంగా వీణా నిక్వణం..

అలౌకికానందంతో అరమోడ్పులైన విశాల నేత్రాలు...

కట్టుకున్నది కాషాయం...

శరీరఛాయ ఆ కాషాయంలో కలిసిపోయింది. వయస్సు నలభై ప్రాంతం...

రెండుగంటల పాటు పురంధరదాసు కీర్తనల్తో ఆ కచేరీ సాగింది. ఇంకా ఎన్ని గంటలైనా శ్రోతలు కదిలుండేవారు కాదు. కానీ... స్వామివారికి పూజా సమయం...

ఆయన ఓ మఠాధిపతి... అటు హిందుస్థానీ ఇటు కర్నాటకం రెండు బాణీలూ ఔపాసన పట్టారు. అందరు మఠాధిపతులు కేవలం దేవతార్చన శాస్త్రోక్తంగా చేస్తే, ఈయన దానిపైన తన స్వరార్చన కూడా జోడిస్తారు.

నన్ను కచేరీకి తీసుకెళ్లినందుకు రెడ్డికి కృతజ్ఞతలు తెలిపాను.రెడ్డి ఆయన శిష్యుడు, భక్తుడు. "ఉండు... స్వామి పూజ అయిపోయిం తర్వాత లోపలికి పిలచుకెళ్తా" అన్నాడు.

మహద్భాగ్యం... లోపలికెళ్లి, తర్వాత ఆ మధుర గాయకుడికి అభివాదం చేసా...

ఎప్పుడూ సాధు సన్యాసులకు నమస్కరించని నేను ఆయనకు అభివాదం చేయడం చూసి రెడ్డి "నాస్తికుడ్ని ఆస్తికుడిగా చేసారు స్వామీ మీరు" అన్నాడు.

"ఈయన నమస్కరించింది ఓ హిందూ మత మఠాధిపతికి కాదు... సంగీతానికి" తెల్లని పలువరస కనపడేట్టు నవ్వుతూ అన్నారాయన.

ఆయన పక్కనే ఆయన గాత్రానికి వీణతో సహకరించిన యువతి వుంది. ఆమె ఆయనకి చేస్తూన్న సపర్యల్లో ఓ ఆరాధనాభావం గోచరించింది నాకు.

ఓ అరగంట తన సంగీతం గురించీ... నా సంగీతాసక్తి గురించీ మాట్లాడారాయన. ఆ యువతి కూడా మా సంభాషణలో పాలుపంచుకుంది.

ఇది జరిగి కొన్నేళ్లైంది. మధ్యమధ్య రెడ్డి స్వామివారి కేసెట్లూ, సీడీలూ తెచ్చిస్తున్నాడు.

ఓ రెండు మూడుసార్లు నేను కూడా ఆయన మఠానికి వెళ్లి వచ్చా... మా జయక్కా

వాళ్లు నన్ను వింతగా చూసారు కూడా... 'వీడేమిటి? మఠాల చుట్టూ తిరగడమేమిటి!' అని.

* * *

మూడేళ్ల క్రితం ఓ విస్ఫోటనం లాంటి వార్త...

స్వామివారు సన్యాసాన్ని సన్యసించారు. గార్హస్థ్యం స్వీకరించారు. తనకు వీణతో సహకరించే యువతిని సంప్రదాయబద్ధంగా వివాహం చేసుకున్నారు... అన్నది వార్త. వట్టి వార్త కాదు దాహనలంలా నాల్కలు చాపుతూ పెంపుమీరిన వార్త.

మఠాధిపతుల్లో, పీఠాధిపతుల్లో, భక్తుల్లో, హైందవ పరిరక్షణ కమిటీల పెద్దల్లో కలకలం... హడావుడి... నిరసనలూ... నిందలూ.

గుళ్లల్లో గోపురాల్లో దేవుళ్లు మాత్రం నిమ్మకు నీరెత్తినట్టు నిమ్మళంగానే వున్నారు. గొడవంతా మత పెద్దలతోనే.

సన్యాసాన్ని విసర్జిస్తానని ఆయన ప్రకటించగానే, మిగిలిన మఠాధిపతులూ, మత పెద్దలూ ఆయన్ని తీవ్రంగా నిరోధించడానికి ప్రయత్నించారు.

"మా అందరి పరువూ తీస్తున్నావు... ఇలాంటివి మామూలే... కావాలంటే ఏదో లోపాయకారీ ఉపాయం చూసుకో మాకేం అభ్యంతరం లేదు" అని కూడా అనేసారు ఆఖరికి.

"అంతకన్నా హేయమైందింకోటి లేదు. నేను మత విశ్వాసం సడలి వెళ్లడంలేదు. నేనీ పీఠానికి తగను. ఒకసారి నా మనసు చలించింది. ఒక లాభం లేదు. మీరెంత నన్ను ఆపినా ఆగను. మరణానికైనా సిద్ధమే" అని యీయన.

మఠాధిపతులూ, మత పెద్దలూ... మానవ నిర్మిత కుహనా శాస్త్రాలూ, ధర్మాలూ కట్టుబాట్లూ అందరూ... అన్నీ ఓడిపోయి ప్రకృతి గెలిచింది.

కాషాయాన్ని త్యజించి నిర్మల శ్వేత వస్త్రాల్లోకి మారారాయన.

ఆయన గళ మాధుర్యానికి నూతన తేజస్సు జత చేరింది. ఆమె వీణా నిక్వణంలో కొత్త సంగతి పలికింది.

వాళ్లకిప్పుడు ఓ బాబు. ●